# మనసుంటే... మనిషైతే..




కుప్పాల వెంకట సుబ్బారావు

**ఇంటి** తాళం కప్పని చూస్తూనే శేఖర్ ప్రశ్నుడిపోయాడు. మన సేదో కీడు శంకించింది.

అనలే అస్తవ్యస్తంగా ఉన్న మనసు మరింత చెదిరినట్టయింది.

ఇంటికేసి అయోమయంగా చూస్తున్న శేఖర్‌కి ప్రక్కింటి కుర్రాడు పరుగెత్తుకుంటూ వచ్చి, "ఆంటీ మీ కీ తాళం ఇవ్వమంది" అంటూ మళ్ళీ తుర్రున పారిపోయాడు.

గుండె చిక్కబట్టుకొని లోపల కెళ్ళాడు శేఖర్.

తిన్నగా బెడ్ రూమ్ కెళ్ళాడు.

టేబుల్‌మీద ట్రాన్సిస్టర్ లెదర్ కేసులో గ్రుచ్చబడిన కాగితం కొట్టొచ్చినట్టు కన్పడింది.

కాగితం అందుకుంటుంటే చేతులు వణికాయి.

కిరణ్మయి వ్రాసిన ఉత్తరం!

చూపులు అక్షరాలవెంట పరుగులు తీశాయి.

అవి అక్షరాలు కావు...అగ్ని గోళాలు!

## 2

పరుగెత్తుకుంటూ ఇంటి వరండాలో కెళ్ళాడతను.

ఆకాశం పెళపెళా గర్జించింది.

ప్రళయకాలం దాపురించినట్టు కారుమబ్బులు క్రమ్ముకొచ్చాయి.

కళ్ళు చెదిరే మెరుపులు...

గుండె లదిరే ఉరుములు...

అరక్షణంలో కుంభవృష్టి మొదలయ్యింది.

భయంకరంగా మీదబడిన పెనుగాలికి చెట్లూ చేమలూ వికృతంగా ఏడ్పు నందుకున్నాయి.

భీతావహంగా మారిన ప్రకృతికి భయపడిన వాడిలా తలుపులుతీసి లోపలి కెళ్ళి, మళ్ళీ వెంటనే తలుపులు వేశాడతను.

బట్టలు మార్చుకున్నాడు.

వరండాలో కెవరో పరుగెత్తుకుంటూ వచ్చిన చప్పుడు...

వెళ్ళి తలుపు తీసి ఆశ్చర్యపోయాడు.

"నువ్వా! లోపలికి రా!" అన్నాడు.

బితుకు బితుకుమంటూ వచ్చిందామె.

అతను వెంటనే తలుపు గడియపెడుతుంటే, ఎక్కడో ఉరిమిన ఉరుము ఆమె గుండెలో ప్రతిధ్వనించింది.

అతను లోపలి గదిలో బెడ్‌మీద పడుకున్నాడు మామూ లుగా.

మరో ఉరుము...

మరో మెరుపు...

ఇంట్లో, వీథిలో ఒక్కసారిగా కరెంటు పోయింది.

అంతటా చిమ్మచీకటి.

అగ్గిపెట్టె ఎక్కడుందో తెలీదు.

టార్చిలైటు సరేసరి.

బయట మెరుస్తోన్న మెరుపులే గాజు కిటికీ ల్లోంచి ఇంట్లోకి ప్రతిఫలిస్తున్నాయి.

ఒకటి...రెండు...మూ డు...అయిదు నిము షాలు...

క్షణక్షణానికీ అది కాళరాత్రిగా మారుతోంది.

ప్రకృతి కరాళ నృత్యం చేస్తోంది బయట.

కానీ, ఆ ఇంట్లో వింతైన వాతావరణం!

వయసులో ఉన్న ఓ ఆడది, ఓ మగా డు...ఒకే ఇంట్లో...ఒంటరిగా...

అతడి హృదయాంతరాలలో ఎక్కడో కలి గిన అలజడి అంతై...ఇంతై...ఒడలంతా వ్యా పిస్తో...పులకిస్తో...

భీతహరిణిలా ఆమె తలుపు నంటిపెట్టుకొ ని, గుండె లరచేత్తో పట్టుకొని...ఒక్కో క్షణం ఒక్కో యుగంగా...

అతనిలో నిలువనీయని ఆవేశం, ఆరా టం, ఆలోచన...

ఎవరు కోరిన ఏకాంతం ఇది?

ఎవరు అడిగిన అవకాశం?

ప్రకృతే జతచేసింది...తానూ...ఆమె...ప్ర కృతీ...

ప్రకృతిలో భాగమే ఆమే, తానూ,

ఇది అసహజంకాదు, ఇది విపరీతం కాదు...

'నీకే సృష్టించబడ్డ ఈ క్షణం నీ సొంతం చేసుకో...చేసుకో...' ఏదో అజ్ఞాతశక్తి చెవుల్లో, గుండెలో, మస్తిష్కంలో హెూరెత్తిస్తోంది.

ఎదలో ఏదో తొందర...

మెల్లగా లేచి ఇవతల కొచ్చా డతను.

ఆమె తలుపుకి మరింత అంటుకుపో యింది.

ఏదో అనుకోని కీడుని ఆమె మనసు శంకి స్తోంది.

ఆమెకు దగ్గరగా అతను...

లయ తప్పుతున్న గుండెలు...

ఆమె కెవ్వు మంది.

"బాబుగారూ! వదలండి. పొట్ట కూటికోసం మీ ఇంట్లో పనిచేసుకు బ్రతికేదాన్ని. నే నల్లాం టిదాన్ని కాదు!"

"ఆదెమ్మా! ప్లీజు...అరవకు...ఒక్కసారి...నా మాట విను..." చేతల్లో తమకం. మాటల్లో తడబాటు. మనిషిలో నిద్రలేచిన మృగం! అది ఉక్కు కౌగిలి. అది ఉడుంపట్టు.

ఆమె గిలగిల, ఆమె వలవల, విలవిల...

"శేఖర్ బాబుగారూ! మీ కాళ్ళు పట్టు కుంటా. నా బతుకు బుగ్గి చెయ్యొద్దు..."

"ఆదెమ్మా...ప్లీజ్..."

బయట ప్రకృతి వికటాట్టహాసం చేసింది.

## 3

ప్రేలడానికి సిద్ధంగా ఉన్న అగ్ని గోళాల్లా ఉన్నాయి అతని కళ్ళు. ఒళ్ళంతా దట్టంగా కారం పూసుకున్నట్టుగా ఉంది అతనికి. మూ ర్తీభవించిన కాఠిన్యం, రూపు దిద్దుకున్న కరకు తనంలా ఉన్నాడు మనిషి.

అతని ముఖంలో, అతని చూపులో, అతని నడకలో తెగింపు, తెంపరితనం...

సింహాచలం అతని పేరు.

పులికి చిక్కిన వేటలా అతని ప్రక్కన నడుస్తోన్న ఆ ఆడ ఆకారం పేరు ఆదెమ్మ.

తన జీవితం ఈరోజుతో సరి...ఆమె మనసు పదే పదే రొదచేస్తోంది. హెచ్చరిస్తోంది. భయంగా, భయంకరంగా అరుస్తోంది.


జుట్టు పట్టుకొని తోసిన త్రోపుకి ఆమె కాళ్ళమీద పడింది ఆదెమ్మ.


"సింహాచలం? ఏమి టీ అఘాయి త్యం?" ఆమె...కిరణ్మయి.

"నాదా అఘాయిత్యం?...ఒకసారి మీ మొ గుడుగార్ని పిలవండి! అఘాయిత్యం ఎవరి దో ఒక్కక్షణంలో ఋజూ చేస్తా!...ఇదెవరో తెలుసా, తల్లీ? నీ సవితి...నీ మొగుడికి పెళ్లాం నీ మొగుడి బిడ్డకు తల్లి కాబోతూంది. పిలవం డాయన్ని?"

శేఖర్ గుమ్మంలో కొచ్చాడు.

సింహాచలం కళ్ళు నిప్పులు కురిపిస్తున్నా యి. అతని చూపులు 'నువ్వూ ఓ మనిషివే నా!' అని నిలదీసి నిలువునా చీరేస్తున్నాయి.






శేఖర్ ముఖం మాడిపోయింది.

అతనిలో శక్తి ఉడిగిపోయింది.

తన పాపం తనని నిలదీసి పరిహసిస్తోన్న క్షణం అది!

తన అకృత్యానికి ఫలితం ఆ సన్నివేశం!

తన దురాగతానికి సాక్ష్యం ఆదెమ్మ కడుపులో మొలక!

"ఏమండీ? ఏమి టిదంతా? మాట్లాడరే?" కిరణ్మయి గొంతులో వణుకు.

బుకాయించడానికి, అబద్ధమాడడానికి గూడా కొంత శక్తి ఉండాలి. ఆదెమ్మ ఏడుపుల్లో, సింహాచలం చూపుల్లో అతని శక్తులన్నీ కలిసి కరిగిపోయాయి.

నిర్జీవ ప్రతిమల్లే నిలబడిపోయాడు శేఖర్.

ఇలాంటి పరిస్థితి ఎదురౌతుందని కలలోగూడ ఊహించలేదు.

జరుగుతున్న సన్నివేశానికి సాక్షీభూతంగా మాత్రం మిగిలాడు.

"ఆ నోటితో ఆయనేం జెబుతాడు? నువ్వు ఊళ్ళోలేని ఓ రోజు ఇది వర్షానికి తల దాచుకోవడానికి ఈ గుమ్మంలో కొచ్చింది. చేసిన ఆ పాపానికి మనిషిలా ఆదరించాల్సిందిపోయి...పాములా కాటేశాడు. పరాయి కూటిని కుక్కలా గతికాడు. నే నావరేసను చేయించుకొని అయిదేళ్ళయింది. డాక్టరమ్మ దీనికి కడుపని చెప్పింది. దీని ఒళ్ళు హూనం చేస్తే ఇది చూపెట్టిన పుణ్యమూర్తి మీ ఆయన! ఇప్పటికే నలుగురికీ ఈ సంగతి తెలిసిపోయింది. రేపట్నించీ నలుగురూ నాలుగు రకాలుగా కాకులై పొడుస్తారు. ఇంత జరిగి ఇక దీన్ని ఏలుకోవాలంటే, నేను చీమూ రక్తం ఉన్న మనిషినేగాని దేవుణ్ణి గాదు! అందుకే...అందుకే దీన్ని ఈ ఇంట్లో వదిలేస్తున్నా. తెగతెంపులు చేసుకొని నే వెళ్ళిపోతున్నా దాన్నేం చేసుకుంటారో ఇక మీ ఇష్టం."

చరచరా వెళ్ళిపోయాడు సింహాచలం.

స్థాణువై నిలబడింది కిరణ్మయి.

బిక్కచచ్చిపోయాడు శేఖర్.

ఏడుస్తూ, పిచ్చిదానిలా వీధిలోకి పరుగెత్తింది ఆదెమ్మ.

## 4

శేఖర్ చూపులు కిరణ్మయి ఉత్తరంలోని అక్షరాలవెంట పరుగులు తీస్తున్నాయి.

అవి అక్షరాలు కావు...అగ్ని గోళాలు...

"మిమ్మల్నేమని సంబోధించాలో తెలీటంలేదు!

మనిషిగా సంబోధించాలంటే మనసు ఒప్పుకోవటంలేదు. అయినా, మనిషిలాగే మీకు రెండు చేతులు, కాళ్ళూ, ముక్కూ, ముఖం ఉన్నాయి. నిన్నటిదాకా మీ మూర్తితోనే నేను కాపురం వెలగబెట్టేను. మీతో ఎన్నో కోర్కెలు, ఆశలు, ఊహలు... పెంచుకున్నాను; పంచుకున్నాను. మీతోడిదే లోకంగా భావించుకున్నాను. నన్ను నేను హృదయపూర్వకంగా అర్పణ చేసుకున్నాను. మీ బిడ్డలకు తల్లినైనాను.

కానీ...మీ నిజరూపం ఈరోజు చూశాక నాకు భయమేస్తోంది. నా ఒళ్ళు జలదరిస్తోంది. అసహ్యం, అయిష్టం, రోత...మీ వ్యక్తిత్వపు దుర్గంధం...నన్ను నిలవనీయడంలేదు.

అబలలపై అత్యాచారాలు చేసే నీచులు, పసికందులపై అఘాయిత్యాలు చేసే దుష్టులు, హీనులు, కామాంధులు మెసిలే లోకం ఇది. ఈ అత్యాచారాలు, ఈ అఘాయిత్యాలు నిత్యకృత్యంగా మారినకాలం ఇది.

కానీ...నా ఇంట్లోనే, నే నభిమానించి, ఆరాధించి, బ్రతుకును పంచుకున్న, నా వాడనుకున్న నా మనిషే ఓ అబలపై అత్యాచారం చేశాడంటే, ఓ నిండుకాపురాన్ని కూలదోశాడంటే, ఓ నిండు జీవితాన్ని బలితీసుకున్నాడంటే...నా కిది భరించశక్యం గావడంలేదు. మీరు చేసిన ఈ ఘోరదురంతానికి నా మనసు దగ్ధమైపోతోంది. నా రక్తం ఉడుకులెత్తుతోంది.

పాపపంకిలమైన మీ చేతులు...ఇక నాకు విషనాగులు. మీ దిక పిశాచపు స్పర్శ మీ ఉనికి, మీ నీడ నా కిక దుర్గంధభూయిష్టం. మీచూపు గొంగళీలు ప్రాకిస్తుంది. మీ నవ్వు వికృతంగా స్ఫురిస్తుంది.

అందుకే...నాకు నేను దూరంగా మా పుట్టింటికి వెళ్ళిపోతున్నాను, పిల్లల్తో సహా.

నా చదువుమీద, నా వ్యక్తిత్వంమీద నాకు పరిపూర్ణమైన నమ్మకం ఉంది. నా మనోబలం...అంతకుమించిన నైతికబలం...నన్నో వ్యక్తిగా నిలబెట్టగలవన్న ఆత్మవిశ్వాసం ఉంది.

ఆఖరుగా రెండు మాటలు-

నీతీ, నియమం అనేవి ఆడదానికైనా-మగాడికైనా, ఉన్నవాడికైనా-లేనివాడికైనా, తనకైనా-పరాయికైనా...అందరికీ ఒక్కటే! అవి మనిషి మనిషికీ మారిపోవు!

ఈ సమాజంలో విలువలు ఎంతగా మంటకలిసిపోతున్నా, ఇంకా ఆమాత్రం ఈమాత్రం విలువలు మిగిలి ఉన్నాయంటే అవి వాటిని పాటించే వారివల్లే; వాటిని అభిమానించే వారివల్లే! మనిషికీ, మనసుకీ మానవత్వానికీ ఇంకా నేను విలువ నిస్తాను. మీరు చేసిన నీతిమాలిన పనిని హర్షించలేను. సర్దుకుపోనూలేను. ఇట్ మే బి మై వీక్నెస్!...అదే నా వ్యక్తిత్వమనుకుంటాను. నా వ్యక్తిత్వాన్ని చంపుకొని జీవచ్ఛవంగా బ్రతకలేను.

తప్పుకు తను కారకురాలు కాకపోయినా, సింహాచలం ఆదెమ్మను అసహ్యించుకొని అవతలకు తోసేస్తే అందులో న్యాయముందో లేదోగాని, అందుకు కారకుడైన మిమ్మల్ని నేను అంతకు రెట్టింపుగా అసహ్యించుకుంటే అది ముమ్మాటికి అర్థవంతమే అవుతుంది.

యూ...మిస్టర్ శేఖర్...

ఐ హేట్ యూ...

గుడ్ బై!"

★